సాక్షి
వైఎస్‌ఆర్‌ జిల్లా

శుక్రవారం । 18 । అక్టోబర్‌ । 2024



పుష్పగిరిలో పౌర్ణమి గ్రామోత్సవం

పుష్పగిరిలో పౌర్ణమి గ్రామోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి, శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాములకు పూజలు నిర్వహించారు. - 8లో



మిషన్‌ వాత్సల్యపై అవగాహన అవసరం

మిషన్‌ వాత్సల్యపై అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ చిల్డ్రన్‌ స్కీం జాయింట్‌ డైరెక్టర్‌ విజయ తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
31.2 /23.9

వాతావరణం

జిల్లాలో గురువారం 23.9 - 31.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్‌.

న్యూస్‌రీల్‌

కేఎంసీ కమిషనర్‌గా మనోజ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



కడప కార్పొరేషన్‌ : కడప మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌గా ఎన్‌. మనోజ్‌రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. 2022 బ్యాచ్‌ గ్రూప్‌-1 అధికారి అయిన ఈయన పలమనేరు ఆర్‌డీఓగా పనిచేశారు. మనోజ్‌రెడ్డి స్వస్థలం రాయచోటి. రాజు విద్యా సంస్థల్లో ఆయన మెట్రిక్యులేషన్‌, ఐఐటీ ముంబైలో గ్రాడ్యుయేషన్‌ పూర్తి చేశారు. మనోజ్‌రెడ్డి సతీమణి ఐఈఎస్‌ అధికారిణి కాగా, ఆయన సోదరుడు ఐఆర్‌ఎస్‌ అధికారిగా ఉన్నారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్‌ మాట్లాడుతూ కలెక్టర్‌ ఆదేశాలను అనుసరించి కడపను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు. మెరుగైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి, వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని తెలిపారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనాల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టారు. అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలు ఇచ్చి ఘనంగా సత్కరించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ కమిషనర్‌ రాకేష్‌ చంద్ర, ఈఈలు ధనలక్ష్మి, నారాయణస్వామి, ఏసీపీ నాగేంద్ర, ఆర్‌ఓలు విజయ్‌బాస్కర్‌గౌడ్‌, కన్నయ్య, సూపరింటెండెంట్లు రాజశేఖర్‌, జి. శివకుమార్‌, కిశోర్‌, డీఈలు తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌తో భేటీ..

నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మేయర్‌ సురేష్‌ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. నగరంలోని పరిస్థితులు, ప్రధాన సమస్యల గూర్చి మేయర్‌ కమిషనర్‌కు వివరించారు.

30 ఏళ్లపాటు కడపకు తాగునీరందించేలా ప్రణాళిక

- పబ్లిక్‌ హెల్త్‌ ఈఈ జే. రమణమూర్తి వెల్లడి



కడప కార్పొరేషన్‌ : కడప నగరంలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా మరో 30 ఏళ్లపాటు నీరందించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు పబ్లిక్‌ హెల్త్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ జె. రమణమూర్తి వెల్లడించారు. గురువారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ రూ.540 కోట్లతో బ్రహ్మం సాగర్‌ నుంచి కడప వరకూ 55.5 కి.మీల మేర పైపులైన్‌ వేయనున్నామని, బండి కనుమపై 13 ఎకరాలలో 95 ఎంఎల్‌డీల సామర్థ్యంతో ట్రీట్‌మెంట్‌ ప్లాంటు నిర్మించబోతున్నామన్నారు. ఈ భూమి రెవెన్యూ, నగరపాలక సంస్థ ఆధీనంలో ఉందని, అది స్వాధీనం కాగానే పనులు మొదలు పెడతామన్నారు. బండి కనుమ నుంచి కడప నగరానికి నీరందించేందుకు పైపులైన్లు ఇదివరకే ఉన్నాయని, అదనంగా చిన్నచౌకు పాత పోలీస్‌స్టేషన్‌, బెల్లంమండీ, కొండాయపల్లె, పీఎంఆర్‌పల్లె, మాసాపేటల్లో ఐదు ఈఎల్‌ఎస్‌ఆర్‌లు నిర్మించనున్నామన్నారు. పైపులైన్‌ వేసేందుకు నేషనల్‌ హైవే వారికి, ఆర్‌అండ్‌బి శాఖకు లేఖలు రాశామన్నారు. త్వరలోనే ఈ పనులను ప్రారంభిస్తామని ఈఈ తెలిపారు.

టెట్‌ పరీక్షకు 180 మంది గైర్హాజరు

కడప ఎడ్యుకేషన్‌ : జిల్లావ్యాప్తంగా గురువారం నిర్వహించిన ఏపీ టెట్‌ పరీక్షకు 180 మంది గైర్హాజరైనట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలోని కడప, పొద్దుటూరులలో కలుపుకుని 8 పరీక్షా కేంద్రాలలో ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో నిర్వహించిన ఏపీ టీచర్‌ ఎలిజిబిలిటి టెస్టు-2024కు 1490 మందికిగాను 1310 మంది హాజరుకాగా 180 మంది గైర్హాజరైనట్లు ఆమె తెలిపారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

28న రాష్ట్ర పురోహిత మౌఖిక పరీక్షలు

కడప కల్చరల్‌ : ఆంధ్రప్రదేశ్‌ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పురోహిత మౌఖిక పరీక్షలు ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు జిల్లా సమాఖ్య గౌరవ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళి శర్మ, జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు మూర్తి రాజు సత్యనారాయణ శర్మ, వారణాశి శ్రీధర శర్మ తెలిపారు. గురువారం వారు విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను తెలిపారు. ఈ నెల 28న ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భీమవరం ఆనంద్‌ ఫంక్షన్‌ హాల్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఇందులో భాగంగా అర్చక పురోహిత మౌఖిక పరీక్షలు ఉంటాయని తెలిపారు. అనంతరం ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు. ఈ సర్టిఫికెట్లతో విదేశాలలో అర్చకత్వం నిర్వహించవచ్చునని, అక్కడి దేవాలయాల్లో అర్చకుడిగా పని చేయవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 991262 6900, 89775 85886 సెల్‌ నెంబర్లను సంప్రదించాలన్నారు.

రైతు కష్టం.. వర్షార్పణం

- నోటి కాడి పంట నేలపాలు.. సాగు ఖర్చు నీళ్లపాలు
- తుఫాన్‌ వర్షాలతో దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలు
- కుదేలైన వరి రైతులు... గగ్గోలు పెడుతున్న మినుము, పత్తి రైతులు
- జిల్లావ్యాప్తంగా 1206.99 హెక్టార్లలో దెబ్బతిన్న వరి
- 160.46 హెక్టార్లలో దెబ్బతిన్న వేరుశనగ, కంది, మినుము, మొక్కజొన్న పంటలు
- కోతదశకు చేరిన 635.20 హెక్టార్లలో దెబ్బతిన్న ఉల్లిపంట
- అప్పుల ఊబిలోకి అన్నదాతలు



“నా పేరు సుబ్బారెడ్డి. నేను ఖాజీపేట మండలం ములపాక వద్ద రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. రెండు ఎకరాల పంట సాగుకు రూ. 50 వేలు ఖర్చుఅయ్యింది. రెండు ఎకరాలకు 10 పుట్ల వడ్లు అవుతాయని ఆశపడ్డాను. రెండు రోజుల్లో వరిపంటను కోద్దామని వరికోత మిషన్‌ను కూడా మాట్లాడుకున్నాను. ఇంతలో తుఫాన్‌ వచ్చి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో వరి పంటంతా నేలవాలింది. నా ఆశంతా నేలపాలు, నీటిపాలయింది. ఇప్పుడు వరి కోసినా ధాన్యం నాణ్యత తగ్గే అవకాశం ఉంది.



“నా పేరు జయచంద్రధర్‌ రెడ్డి. మాది దువ్వూరు మండలం చిన్న సింగనపల్లి. నేను రెండు ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేశాను. ఎకరాకు రూ.70 వేలు ఖర్చుపెట్టాను. మరో రెండు రోజుల్లో గడ్డలు పీకుదామని కూలీలను సిద్ధం చేసుకున్నాను. ఇంతలో తుఫాన్‌ అని చెప్పారు. దీంతో వరుసగా మూడు రోజులపాటు వర్షం కురవడంతో పంటలో నీరంతా నిలిచి గడ్డలు కుళ్లిపోతున్నాయి. రేటు బాగుంది పది రూపాయలు వస్తుందని ఆశపడ్డా. నా ఆశంతా నీటిపాలయింది.

ఇది ఈ ఇద్దరి రైతుల ఆవేదన మాత్రమే కాదు.. జిల్లాలోని చాలా మంది రైతుల కన్నీటి వ్యథలు.

కడప అగ్రికల్చర్‌ : పంటలపై తుపాను ప్రభావం చూపడంతో అన్నదాతలు తీవ్రంగా నష్ట పోయారు. జిల్లాలో నదీ పరివాహక ప్రాంతాలతోపాటు నీటి వసతి ఉన్న చాలా మంది రైతులు ఈ ఏడాది ముందస్తుగా వరిపంటను సాగు చేసుకున్నారు. ప్రస్తుతం ఆ వరిపంట కోత దశకు చేరుకుంది. మరో రెండు మూడు రోజుల్లో కోతలు ప్రారంభించాలనుకున్న తరుణంలో తుఫాన్‌ అన్నదాతలను నిలువునా ముంచేసింది. వర్షం దాటికి వరిపంట పూర్తిగా నేల వాలింది. ప్రస్తుతం కిందపడిన వరిని కోయాలంటే వరి కోత మిషన్‌తో సాధ్యం కాదు. భూమి ఆరే వరకు ఉంటే నేమో గింజలన్నీ మొలకెత్తే అవకాశం ఉంది. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

- వేరుశనగ, మినుము, మొక్కజొన్న, కంది పంటల్లో కూడా వర్షపు నీరు నిల్వ ఉండటంతో పంటలు దెబ్బతిన్నాయి. అక్కడక్కడ వేరుశనగ కోతదశకు వచ్చింది. ఈ పంటల్లో నిలిచిన నీటితో కాయలకు మోసులు వస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మినుము కూడా కొన్ని చోట్ల కోతదశలో ఉంది. ఈ వర్షంతో ఆ పంటలన్నీ దెబ్బతిన్నాయి.
- చాలా మండలాల్లో ఉల్లి పంట కూడా కోతదశకు వచ్చింది. మరో నాలుగైదు రోజుల్లో ఉల్లి కోసేందుకు రైతన్నలు సన్నద్ధమయ్యారు. ఈ తరుణంలోనే వర్షం రావడంతో పొలాల్లో నీరంతా నిలిచిందని ఈ నీటిలో ఎర్రగడ్డలు కుళ్లిపోతాయని ఉల్లి రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

1367.46 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు..

తుపాన్‌ కారణంగా కురిసిన వర్షాలకు జిల్లాలోని 52 గ్రామాల్లో 1840 మంది రైతులకు చెందిన 1367.46 హెక్టార్లలో వ్యవసాయ పంటలు తెబ్బతిన్నాయి. ఇందులో 1206.99 హెక్టార్లలో వరిపంట, 21.04 హెక్టార్లలో వేరుశనగ, 122.83 హెక్టార్లలో మినుము పంట, 16.19 హెక్టార్లలో మొక్కజొన్న పంట దెబ్బతిన్నాయి.

635.20 హెక్టార్లలో ఉల్లిపంట...

జిల్లాలోని దువ్వూరు, ఎర్రగుంట్ల, వీఎన్‌పల్లి, వేంపల్లి, ముద్దనూరు మండలాల పరిధిలో సాగు చేసిన 828 మంది రైతులకు సంబంధించిన 635.20 హెక్టార్లలో ఉల్లిపంట కోత దశకు చేరకుంది. వర్షాలకు ఈ పంటంతా దెబ్బతింది.





ఖాజీపేట మండలం ములపాక వద్ద తుఫాన్‌కు దెబ్బతిన్న వరిపంట (ఇన్‌సెట్‌) ఎర్రగుంట్ల మండలం సిర్రాజుపల్లెలో వర్షంతో తెబ్బతిన్న ఎర్రగడ్డలను చూపుతున్న రైతు

రూ. 40 వేలు నష్టం



నేను సిద్దవటం మండలం వంతాటిపల్లిలో 2 ఎకరాల 22 సెంట్లలో వరిపంటను సాగు చేశాను. ప్రస్తుతం వరిపంట కోతదశకు వచ్చింది. ఉన్నట్లుండి వచ్చిన తుఫాన్‌తో వరిపంటంతా నేలకొరిగింది. నాకు 2.22 ఎకరాల్లో పంటసాగుకు రూ. 40 వేల దాకా ఖర్చు వచ్చింది. దీంతో పాటు దిగుబడి కూడా తగ్గుతుంది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- ఫతాన్‌ ఫైరోజ్‌, వంతాటిపల్లి, సిద్దవటం మండలం.

రైతులను ఆదుకోవాలి...



తుఫాన్‌ కారణంగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. పెన్నా, పాపాగ్ని నదీ పరివాహక ప్రాంతాల్లో వేల ఎకరాల్లో వరిపంట కోతదశకు వచ్చింది. వర్షాలకు పంటంతా కిందపడి నేలపాలయింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. దీంతోపాటు ఉద్యాన, వాణిజ్య పంటలు కూడా దెబ్బతిన్నాయి. వీరందరికీ పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వమే చెల్లించాలి.

- దస్తగిరి రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

జిల్లా అంతటా జోరు వాన

- ఒంటిమిట్టలో అత్యధికంగా 85.6 ఎంఎం

కడప అగ్రికల్చర్‌ : తుఫాన్‌ కారణంగా జిల్లావ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురిశాయి. జిల్లాలో ఒంటిమిట్ట మండలంలో అత్యధికంగా 85.6 ఎంఎం వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా గత మూడు రోజుల నుంచి జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా వర్షపాతం వివరాలు ఇలా..

మండలం	వర్షపాతం మి. మీ..	మండలం	వర్షపాతం
		కొండాపురం	39.6
		జమ్మలమడుగు	36.2
ఒంటిమిట	85.6	పోరుమామిళ్ల	35.2
సిద్దవటం	70.2	బికోడూరు	34.6
చెన్నూరు	67.8	మైదుకూరు	33.6
సికెదిన్నె	63.6	సింహాద్రిపురం	32.8
కడప	63.2	కలసపాడు	32.6
ఖాజీపేట	62.8	తొండూరు	32.2
అట్లూరు	60.0	మైలవరం	30.6
ఎర్రగుంట్ల	55.4	బిమఠం	29.2
వల్లూరు	49.8	దువ్వూరు	28.6
పెండ్లిమర్రి	48.2	చాపాడు	28.6
కమలాపురం	47.6	గోపవరం	26.8
వేంపల్లి	42.6	బద్వేల్‌	25.2
వీఎన్‌పల్లి	42.2	పొద్దుటూరు	25.2
ముద్దనూరు	41.6	లింగాల	24.8
కాశినాయన	40.4	చక్రాయపేట	24.6
పులివెందుల	40.2	రాజుపాలెం	23.4
వేముల	40.0	పెద్దముడియం	14.8

నిరంతర పర్యవేక్షణ చేయండి

ఇంచార్జి కలెక్టర్‌ అదితి సింగ్‌



కడప సెవెన్‌ రోడ్స్‌ : జిల్లాలో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ నిరంతర పర్యవేక్షణ చేయాలని ఇంచార్జి కలెక్టర్‌ అదితి సింగ్‌ ఆదేశించారు. గురువారం టెలి కాన్ఫరెన్సు ద్వారా ఆర్డీవోలు, తహశీల్దార్లు, మున్సిపల్‌ కమిషనర్లు తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. ప్రాణ, పశు, పంట నష్టంపై మండలాల వారిగా అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా ఇళ్లు కూలిపోవడం జరిగిందా అని ఆరా తీశారు. ఒకటి రెండు చోట్ల పాత మిద్దెలు వర్షానికి తడిసి కొంత మేర పడిపోయాయని, అదృష్ట వశాత్తు ఆ సమయంలో అందులో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదన్నారు. జిల్లా లోని రిజర్వాయర్లకు చేరుతున్న నీటి మట్టాన్ని నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. చెరువులు, వాగులు వంకలు, కాలువల గట్లు తెగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్‌ అండ్‌ బి రోడ్లు, పంచాయతీ రోడ్లు, బ్రిడ్జిల పై నిఘా ఉంచాలన్నారు. నిరంతర విద్యుత్తు ఇవ్వాలని, ఎక్కడైనా కాలువలు, చెరువుల గట్లు తెగినా, బ్రిడ్జీలు కూలినా వెంటనే కంట్రోల్‌ రూమ్‌కు సమాచారం తెలియచేయాలన్నారు. ఇప్పటి దాకా జరిగిన నష్టాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. జిల్లాలో వర్ష ప్రభావం తగ్గిందని అధికారులు ఏమరుపాటుగా ఉండరాదని సూచించారు.

మైలవరం నుంచి నీరు విడుదల



పెన్నానదిలో ప్రవహిస్తున్న వరద నీరు



తెగిపోయిన పెద్దదండ్లూరు- సుగుమంచిపల్లె రోడ్డు

జమ్మలమడుగు : మైలవరం జలాశయం నుంచి పెన్నానదిలోకి వరద నీటిని ఇరిగేషన్‌ అధికారులు విడుదల చేశారు. గురువారం 8 వేల క్యూసెక్కుల నీటిని నాలుగు గేట్ల ద్వారా విడుదల చేశామని మైలవరం జలాశయం ఈఈ రమేష్‌ తెలిపారు. ప్రస్తుతం రాయలసీమ ప్రాంతంలో భారీ వర్షాలు కురవడంతోపాటు అనంతపురం ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. ఆ వరద నీరు గండికోట జలాశయంలో చేరడంతో గండికోట నుంచి నీటిని మైలవరం జలాశయంలోనికి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో పూర్తిస్థాయిలో నీటి సామర్థ్యం ఉండటంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీటిని వచ్చింది వచ్చినట్లుగా దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికారులు..

మైలవరం నుంచి భారీ స్థాయిలో వరదనీరు విడుదల అవుతుండటంతో పెన్నానది పరివాహక గ్రామాలైన వేపరాల, దొమ్మరనంద్యాల, మోరగుడి, జమ్మలమడుగు, పొన్నతోట, గూడెంచెరువు, హనుమద్‌గిరి, అంబవరం, గొరిగేనూరు దేవగుడి, సున్నపురాళ్లపల్లి, పెద్దదండ్లూరు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

రాకపోకలు బంద్‌...

మండల పరిధిలోని సున్నపురాళ్లపల్లె-పెద్దదండ్లూరు గ్రామాల మధ్య ఉన్న రోడ్డు పెన్నానదిలోని నీటి ప్రవాహానికి దెబ్బతింది. దీంతో పెద్దదండ్లూరు, సిరిగేపల్లి గ్రామాల ప్రజలకు రాకపోకలు బంద్‌ అయ్యాయి.

కుందూ పరవళ్లు



చాపాడు : గత నాలుగు రోజులుగా కురుస్తున్న తుఫాను వర్షాల వలన మండలంలోని కుందూనది వరద నీటితో పరవళ్లు తొక్కుతోంది. మండల పరిధిలోని కుందూనదిలో గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ 24వేల క్యూసెక్కులతో ప్రవహించగా సాయంత్రం 4గంటల నుంచి 27వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తున్నట్లు సీడబ్ల్యూసీ అధికారి కుమార్‌ తెలిపారు. కుందూనది పరీవాహంలోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే తహసీల్దారు రమాకుమారి ఆదేశాలు జారీ చేశారు. అన్నవరం, సీతారామాపురం కుందూనది వంతెనల వద్ద గ్రామ సేవకులను పహారా పెట్టారు.

కూలిన ఇంటి పైకప్పు



ముద్దనూరు : మండలంలోని చిన్న కత్తెర పల్లె గ్రామంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి పైకప్పు కూలిపోయింది. గ్రామానికి చెందిన పద్మావతి, రమణయ్యలకు చెందిన ఇల్లు పూర్తిగా దెబ్బతింది. ఇల్లు కూలిన సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తమకు నష్టపరిహారం అందజేయాలని బాధితులు కోరుతున్నారు.

అంతా నా ఇష్టం..!

- కడప కార్పొరేషన్‌లో అదనపు అధికారి నియంతృత్వ పోకడ
- గత కమిషనర్‌ ఆదేశాలే ఆయనకు శిరోధార్యం
- పాలకవర్గం, స్టాండింగ్‌ కమిటీ తీర్మాణాలు బేఖాతర్‌
- ఇటీవల ప్రొటోకాల్‌ ఉల్లంఘనపై వివాదం
- ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్‌ చేయాలని కార్పొరేటర్ల యోచన

కడప కార్పొరేషన్‌ : కడప నగరపాలక సంస్థలో ఆయన ఓ అదనపు అధికారి. కొత్తగా సర్వీసులోకి వచ్చిన ఆయనకు ఇంకా ప్రొబేషన్‌ పీరియడ్‌ కూడా పూర్తి కాలేదని తెలుస్తోంది. కాలవ్యవధి పూర్తికాక మునుపే ఆయన చేస్తున్న అతి సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. గతంలో ఐఏఎస్‌ అధికారి కమిషనర్‌గా ఉన్న సమయంలో కొంతమంది ఆడిందే ఆట...పాడిందే పాటగా సాగిందన్న విమర్శలున్నాయి. అందులో ఈయన ముఖ్యుడని చెప్పుకోవచ్చు. సదరు ఐఏఎస్‌ అధికారి బదిలీ అయి వేరొక ప్రాంతానికి వెళ్లినా ...ఈయన మాత్రం ఆయన ఆదేశాలే శిరోధార్యంగా పాటిస్తున్నట్లు కార్పొరేషన్‌ వర్గాలు కోడై కూస్తున్నాయి.

ప్రొటోకాల్‌ ఉల్లంఘన...వివాదం

ఇటీవల ఎర్రముక్కపల్లెలోని గాంధీనగర్‌ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న గాంధీప్లాజా పార్కు ప్రారంభోత్సవానికి నగర ప్రథమ పౌరుడు మేయర్‌కు, కార్పొరేటర్లకు ఆహ్వానం పంపలేదు. వారి పేర్లు కూడా శిలాఫలకంలో రాయకుండా ఎమ్మెల్యేతో ప్రారంభోత్సవం చేయించారు. ప్రొటోకాల్‌ ఉల్లంఘనపై మేయర్‌, కార్పొరేటర్లు ఆగ్రహానికి గురై స్టాండింగ్‌ కమిటీ సమావేశంలో ఆయన్ను నిలదీశారు. ప్రొటోకాల్‌ ఉల్లంఘనపై మేయర్‌ సీడీఎంఏకు లేఖ కూడా రాశారు.

నగరపాలక సంస్థలో పనిచేసే ఏ ఉద్యోగికి పదోన్నతి ఇవ్వాలన్నా, డిప్యూటేషన్‌పై పంపాలన్నా స్టాండింగ్‌ కౌన్సిల్‌ లేదా జనరల్‌ బాడీ అనుమతి తప్పనిసరి. కాగా గత కమిషనర్‌ ఉన్న సమయంలో ఆయన ఇష్టానుసారంగా అడ్డగోలు నిర్ణయాలు తీసుకొని ప్రజల నెత్తిన భారం వేయడంతోపాటు, కార్పొరేషన్‌ ఖజానాకు కూడా గండికొట్టారనే ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగానే 20 మంది వలంటీర్లకు రూ.12 వేల వేతనం ఇచ్చేలా టాస్క్‌ఫోర్స్‌ టీం ఏర్పాటు చేశారు. వారు అప్పటి కమిషనర్‌కు అంగరక్షకులుగా ఉండేవారు. అలాగే రెవెన్యూ, శానిటేషన్‌, టౌన్‌ప్లానింగ్‌, ఇంజినీరింగ్‌ విభాగాల్లో కొందరు సెక్రటరీలకు ఆర్‌ఐలుగా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా, బిల్డింగ్‌ ఇన్‌స్పెక్టర్లు, ఏఈలుగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇటీవల స్టాండింగ్‌ కమిటీ వారి ఇన్‌చార్జి బాధ్యతలు రద్దు చేసి యథాస్థానాలకు పంపాలని తీర్మాణించింది. టాస్క్‌ఫోర్స్‌ కమిటీని రద్దు చేయాలని సిఫారసు చేసింది. అయితే అడ్మినిస్ట్రేషన్‌లో వారి జోక్యం ఏమిటని ఈ అదనపు అధికారి ఆ నిర్ణయాలను బేఖాతర్‌ చేస్తున్నట్లు సమాచారం.

హడావుడిగా బదిలీల కౌన్సిలింగ్‌కు ప్రకటన

సాధారణంగా ఏ ఉద్యోగి అయినా సరిగా పనిచేయకపోతే వేరొక చోటికి మారుస్తారు. అప్పటి కమిషనర్‌ హయాంలో నెల, రెండు నెలలు మెడికల్‌, మెటర్నిటీ సెలవులు పెట్టిన సెక్రటరీలకు వార్డులు మార్చి వారికి ఇష్టం వచ్చినచోట వేశారు. ఈ అదనపు అధికారికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించిన సమయంలో అధికారం లేకపోయినా పదిహేను మందిని బదిలీ చేసినట్లు సమచారం. తాజాగా 100 సచివాలయాల్లో పని చేస్తున్న వారందరికీ జోన్లు మార్చడానికి కౌన్సిలింగ్‌ తేది ప్రకటించారు. కానీ ఇందులో ఓ మెలిక ఉంది. తమకు నచ్చిన వారిని మాత్రం ఈ బదిలీల నుంచి మినహాయించినట్లు తెలిసింది. గురువారం కొత్త కమిషనర్‌ వస్తున్నారని తెలిసినా...ఆయన ఆదేశానుసారంగా నడుచుకుందామనే ఆలోచన లేకుండా బుధవారం రాత్రే హడావుడిగా ఈనెల 18వ తేది శుక్రవారం బదిలీల కౌన్సిలింగ్‌ నిర్వహించేందుకు తేదీ ప్రకటించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బీఎల్‌ఓ విధులు నిర్వహిస్తున్న వారిని జనవరి 6 వరకూ బదిలీ చేయరాదని ఎన్నికల కమిషన్‌ అక్టోబర్‌ 3న ఉత్తర్వులు జారీ చేసింది....ఇంతమందిని ఒకేసారి బదిలీ చేస్తే కొత్త వార్డుల్లో పనిచేయడానికి ఒకట్రెండు నెలలు సమయం పట్టే అవకాశం ఉంది. దీనివల్ల పరిపాలన గాడి తప్పే అవకాశం ఉంది. అయినా ఆ అధికారి ఇవేమీ లెక్కచేయడం లేదు. స్మూత్‌ అడ్మినిస్ట్రేషన్‌ను పక్కదారి పట్టిస్తూ ... తమ నిర్ణయాలు, తీర్మాణాలకు గౌరవం ఇవ్వకుండా...వాటిని అమలు చేయకుండా ఈ అదనపు అధికారి వ్యవహార శైలిపై విసుగుచెందిన కార్పొరేటర్లు ఆయన్ను ప్రభుత్వానికి సరెండర్‌ చేయాలని యోచిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం



వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఇంచార్జ్‌ కలెక్టర్‌ అదితి సింగ్‌



వాల్మీకి చిత్రపటానికి పూలమాల అలంకరిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌ రాజు

కడప సెవెన్‌ రోడ్స్‌ : రామాయణాన్ని లోకానికి పరిచయం చేసిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని, వారి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్‌ అదితి సింగ్‌ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ, బి.సి. కార్పొరేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మహర్షి వాల్మీకి జయంతి ఉత్సవాలను మనం రాష్ట్ర పండుగ గా జరుపుకుంటున్నామన్నారు. రామాయణ మహాకావ్యాన్ని రచించడం ద్వారా సమాజ శ్రేయస్సుకు అవసరమైన ఎన్నో జీవన సూత్రాలను తెలియచేసిన వాల్మీకి మహర్షికి మనమందరం రుణపడి ఉన్నామన్నారు. రామాయణం సామాజిక నీతిని బోధిస్తుందన్నారు. అనంతరం వాల్మీకి కుల సంఘాల నాయకులు తెలిపిన సమస్యలను పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మానవతా విలువలను పెంపొందించుకోవాలి

- ఎస్పీ వి. హర్షవర్ధన్‌ రాజు

కడప అర్బన్‌ : రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్‌ రాజు ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీ క్యాంప్‌ కార్యాలయం కాన్ఫరెన్స్‌ హాల్‌లో శ్రీ వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శ భావాలను బోధించే మధుర కావ్యం రామాయణమని అన్నారు. అటువంటి గొప్ప కావ్యాన్ని రచించి యుగాలు మారినా కూడా ఆదర్శంగా నిలిచే విధంగా వాల్మీకి మహర్షి సమాజానికి అందించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్‌. డీఎస్పీ మురళీధర్‌, జిల్లా పోలీసు కార్యాలయం ఏ.ఓ జ్యోతి, సిబ్బంది, ఆర్‌ఐలు ఆనంద్‌, టైటాస్‌, శ్రీశైలరెడ్డి, పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పు శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పుష్పగిరిలో ఘనంగా పౌర్ణమి గ్రామోత్సవం



పుష్పగిరిలో శ్రీ కామాక్షీ వైద్య నాథ స్వామి, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి గ్రామోత్సవం

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలో పౌర్ణమి గ్రామోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం శ్రీ కామాక్షీ వైద్యనాథస్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి ఇరువురు స్వాములను వేర్వేరు పల్లకీలపై ఆశీనులను చేసి పూజలు జరిపారు. అనంతరం పల్లకీలపై మోస్తూ పుష్పగిరి మాడ వీధుల్లో మంగళవాయిద్యాలు, దివిటీ వెలుగులో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ముద్దనూరు : మండలంలోని ఆరవేటిపల్లె గ్రామానికి చెందిన చంద్రిక(19) అనే యువతి అదృశ్యమైనట్లు గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ మైనుద్దీన్ సమాచారం మేరకు ఈనెల 15 వతేదీన చంద్రిక ఇంటినుంచి వెళ్లింది. ఆమె ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితంలేదు. దీంతో చంద్రిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వర్షాల్లో జాగ్రత్తలతోనే పంట నష్ట నివారణ

- ఖాలాల్లో నిలిచిన నీటిని వెంటనే తొలగించాలి
- కేవీకే జిల్లా కో ఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య





కడప అగ్రికల్చర్ : అల్పపీడనం కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వ్యవసాయ, ఉద్యాన పంటల్లో నీరు నిలిచి గాలిలో తేమ శాతం పెరగడం వలన పూతరాలటం, పెరుగుదల కుంటుపడటంతోపాటు పంట నాణ్యత కూడా లోపిస్తుంది. చీడపీడల ఉధృతి పెరుగుతుంది. భూమిలోని పోషకాలు సరిగా మొక్కలకు అందక ఎదుగుదల ఆగిపోతుంది. విత్తనాలు మొలకెత్తకుండా కుళ్లిపోయే అవకాశం ఉంది. సకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య సూచిస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- వీలైనంత త్వరగా చేలల్లో అధికంగా ఉన్న నీటిని తీసివేయాలి.
- పంట ఎదుగుదలకు తోడ్పడే విధంగా బూస్టర్ డోస్ ఎరువులను వేసుకోవాలి.
- అధిక తేమ వలన ఉధృతి పెరిగే అవకాశం గల తెగుళ్లు, పురుగుల నివారణకు చర్యలు చేపట్టాలి.
- వర్షాలు ఆగిన వెంటనే అంతర సేద్యం చేసి కలుపు తొలగించుకోవాలి.
- నేల కొంచెం ఆరిన తరువాతే రసాయనిక ఎరువులను నేలలో వేసుకోవాలి

వరిపంటకు..

- వరిలో పాము పొడ నివారణకు హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్లు లేదా పోపికొనజోల్ 1 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- అగ్గి తెగులు తట్టుకోలేని రకాలలో బీపీటీ 5204 లేదా జేజీఎల్ 384లకు తుఫాను వర్షాలు వెలిసిన తర్వాత ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాము లేదా ఐసోప్రోథయొలేన్ 1.5 మిల్లీలు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పైన తెలిపిన రెండు తెగుళ్లు కూడా ఉధృతిగా కనిపించినట్లయితే ట్రైఫ్లోక్సీస్ట్రోబిన్ + టేబ్యుకొనజోల్ కలిసిన మందును 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పడిపోయిన కుదుళ్లను నిలబెట్టి గుంపులుగా కట్టాలి. గింజ మొలకెత్తకుండా, రంగు మారకుండా లీటరు నీటికి 50 గ్రాములు ఉప్పు కలిపి పిచికారీ చేయాలి.

పత్తి పంటకు..

- వర్షాలు తగ్గగానే, వీలైనంత త్వరగా, మురుగు నీరు తొలగించి అంతర కృషి చేసి, నేల ఆరేలా చేయాలి.
- అధిక తేమ వలన మొక్కలు భూమి నుంచి పోషకాలను గ్రహించే స్థితిలో ఉండవు. అలాంటి పరిస్థితుల్లో మొక్కలు ఎర్రబడటం, వడలటం, ఎండిపోవడం జరుగుతుంది.
- దీని నివారణకు 2% (20 గ్రా) యూరియా లేదా 2% (20 గ్రా) పొటాషియం నైట్రేట్ 1% (10 గ్రా) మెగ్నీషియం సల్ఫేట్‌తో లీటరు నీటికి కలిపి 5–7 రోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేయాలి.
- నల్ల మచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి 2–3 పర్యాయాలు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు 3 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 మిల్లీ ప్రోపికొనజోల్ లేదా 1 గ్రాము కాప్టాన్+ ప్రోపికొనజో లీటరు కలిపి 2–3 పర్యాయాలు 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.

వేరుశనగ పంటకు..

- వేరుశనగలో ఆకుమచ్చ, కాండం కుళ్లు తెగులు ఉధృతి పెరగకుండా హెక్సాకొనజోల్ 2 మిల్లీలు/లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- ఇనుము లోపాన్ని సవరించడానికి ఫెర్రస్‌సల్ఫేట్ 5 గ్రా/లీ తో పాటుగా సిట్రిక్ యాసిడ్ 1 గ్రా/లీ పిచికారీ చేయాలి.
- పంట కోతకు సిద్ధంగా ఉన్న చోట వర్షాలు ఆగే వరకు పంటకోత ఆలస్యం చేయాలి.

కూరగాయ పంటలు..

- పొలంలో నీరు నిలిచినప్పుడు నీటిని తీసివేయాలి. 19:19:19 : 5గ్రా/లీ., మెగ్నీషియం సల్ఫేట్ 5గ్రా/లీ. వంటి పోషకాలను పంటపై పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి సూక్ష్మపోషకాలను కూడా పిచికారీ చేసుకోవాలి.
- నీటిని తీసివేశాక, 13:0:45 5 గ్రా/లీ. కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.
- ముంపులో ఉన్న మొక్కలలో ఇనుప ధాతు లోపం ఎక్కువగా కనిపిస్తుంది. నివారణకు ఫెర్రస్‌సల్ఫేట్ 5 గ్రా/లీ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- వంగ, కాకర వంటి పంటలను ఆశించే అక్షింతల పురుగు, చిత్తపురుగుల నివారణకు వర్షాలు ఆగిన వెంటనే క్లోరిపైరిఫాస్ : 2 మి.లీ/లీ లేదా థయోడికర్బ్ : 1గ్రా./లీ పిచికారీ చేసుకోవాలి
- ఎండు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా./లీటరు లేదా మెటాలాక్సిల్ + మాంకోజెబ్ :2 గ్రా/లీ ను మొక్కల మొదళ్లలో పోయాలి.
- ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు కార్బెండిజం : 1గ్రా./లీ లేదా మాంకోజెబ్ :2.5 గ్రా/లీ లేదా సాఫ్ 2.5 గ్రా/లీ. ను పిచికారీ చేసుకోవాలి.

టమాటా పంటకు..

- వర్షాలు ఆగి, పొలం నుంచి నీరు బయటకు పోయిన తర్వాత ఆకు మాడు తెగులు ఆశించకుండా మాంకోజేబ్ లేదా క్లోరోథలోనిల్ 2 గ్రా.మందును లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 4 సార్లు పిచికారీ చేయాలి.

పసుపు పంటకు..

- వర్షాలు ఆగి, పొలం నుంచి నీరు బయటకు పోయిన తర్వాత వెంటనే పసుపు పంటపై లీటరు నీటికి 5 గ్రాముల పొటాషియం నైట్రేట్ కలిపిన ద్రావణాన్ని వారం రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలి
- ఆకుమచ్చ తెగులు వ్యాపించకుండా ముందు జాగ్రత్తగా లీటరు నీటికి 1 మీ.లిప్రోపికోనజోల్ ద్రావణాన్ని కలిపి పిచికారీ చేయాలి.
- దుంపకుళ్లు తెగులు ఆశించినట్లు గుర్తిస్తే పాదుల్లో మొక్కల చుట్టూ నేలను కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా./లీటరు లేదా రిడోమిల్ 2.5 గ్రా/లీ. నీటికి కలిపిన ద్రావణంతో తడపాలి. తెగులు ఉధృతి అధికంగా ఉంటే లీటరు నీటికి 2.5 గ్రా. రిడోమిల్ మందును కలిపిన ద్రావణంతో తడపాలి.

పూల తోటలు..

- మొక్కలపై 2% యూరియా లేదా 1% 13–0–45 ను వారం రోజుల వ్యవధిలో 2, 3 సార్లు పిచికారీ చేయాలి.
- ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రోపికోనజోల్ 1 మి.లీ./లీటరు నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో 1, 2 సార్లు పిచికారీ చేయాలి
- కోతకు సిద్ధంగా ఉన్న పువ్వులను వీలైనంత త్వరగా కోసుకోవాలి. పువ్వులను కోసిన తరువాత, మార్కెట్ కు పంపేలోపు వాటిని తాత్కాలికంగా బాగా గాలి, వెలుతురు వచ్చే ప్రదేశంలో నిల్వ చేయాలి. వీలైనంత త్వరగా మార్కెట్‌కు పంపాలి.

జలవనరుల శాఖలో ఎఫ్‌ఏసీ అధికారుల నియామకం

కడప/మదనపల్లె : జలవనరుల శాఖలో ఈఈ, డిప్యూటీ ఈఈలుగా పనిచేస్తున్న పలువురికి ఎఫ్ఏసీ ఎస్ఈ, ఈఈలుగా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జి.సాయిప్రసాద్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అందులో భాగంగా పెనుకొండ డివిజన్ గోరంట్లలో పనిచేస్తున్న డిప్యూటీ ఈఈ పూల గంగాధరను హెచ్ఎన్ఎస్ఎస్ డివిజన్ నెం.11, కదిరి, హంద్రీనీవా సుజలస్రవంతి సర్కిల్–3, మదనపల్లెకు ఎఫ్ఏసీ ఈఈగా బదిలీ చేశారు. పలమనేరు డివిజన్‌లోని కుప్పం ఇరిగేషన్ సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న గణేనాయక్ సుగాలీని హెచ్ఎన్ఎస్ డివిజన్ నెం.12, కుప్పం, హంద్రీనీవా సుజల స్రవంతి సర్కిల్–3, మదనపల్లెకు బదిలీ చేశారు. పులివెందుల డివిజన్, కొండాపురం జీకేఎల్ఐ డివిజన్‌లో పనిచేస్తున్న ఏ.ఎల్.శ్రీనివాస్‌ను జీకేఎల్ఐ డివిజన్, పులివెందుల, ఎస్.కే.డీ.జీఎన్ఎస్ఎస్ సర్కిల్, కడపకు బదిలీచేశారు. లింగంగుంట్ల డివిజన్, నరసారావుపేట సబ్ డివిజన్‌లో డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న వెంకటేశ్వర ప్రసాద్‌ను టీజీపీ క్యూసీఅండ్ఐ డివిజన్, ఎస్ఈ డిజైన్స్, క్యూసీ సర్కిల్ కడపకు ఎఫ్ఏసీ ఈఈగా బదిలీ చేశారు. అలాగే ఎన్‌టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్ట్, కడప డివిజన్, బద్వేల్‌లో ఈఈగా పనిచేస్తున్న వి.శేషుబాబును, డిజైన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ సర్కిల్, చీఫ్ ఇంజినీర్(ప్రాజెక్ట్స్) కడపకు ఎఫ్ఏసీ ఎస్ఈగా బదిలీ చేశారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని రాణీవనంలో నాపరాయి పాలిష్ మిషన్ వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.52,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేశ్‌బాబు తెలిపారు. అరెస్టు అయిన వారిలో తుంగా బాలాజీ, చింతా బాబుల్‌రెడ్డి, తులసీశ్వర్‌రెడ్డి, సోమిరెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఉన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ నాగమురళి, సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్యపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ చిల్డ్రన్ స్కీం జాయింట్ డైరెక్టర్ విజయ

కడప కోటిరెడ్డి సర్కిల్ : మిషన్ వాత్సల్యపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రాష్ట్ర మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ చిల్డ్రన్ స్కీం జాయింట్ డైరెక్టర్ విజయ తెలిపారు. గురువారం కడప నగరంలోని డీఆర్‌డీఏ హాల్‌లో కడప, కర్నూలు, చిత్తూరు, నంద్యాల, అన్నమయ్య, తిరుపతి, శ్రీ సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని మిషన్ వాత్సల్య సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎలా పరిష్కరించాలో తెలుసుకోవచ్చన్నారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు పి. రోహిణి మాట్లాడుతూ పిల్లలకు ఉన్న హక్కులు, చట్టాలపై సిబ్బంది ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమన్వయం, అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

ప్రోగ్రాం మేనేజర్ కమల్ కుమార్ బాలల న్యాయ చట్టం గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అకౌంట్స్ ఆఫీసర్ ఎస్. సురేష్ చంద్ర, మిషన్ వాతల్య సిబ్బంది, డీసీపీఓలు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల ఏర్పాటుపై సందిగ్ధం



కవాతు చేస్తున్న సీఐ, ఎస్ఐ, సిబ్బంది

ముద్దనూరు : ముద్దనూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేయాల్సిన రెండు మద్యం దుకాణాలపై సందిగ్ధం నెలకొంది. దీంతో గురువారం రాత్రి అదనపు పోలీసు బలగాలు స్టేషన్‌కు చేరుకున్నాయి. రెండు దుకాణాలు అధికార పార్టీకి చెందిన వారికే దక్కడంతో ఇరువర్గాల మధ్య చర్చలు కొనసాగాయి. గురువారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో పొట్లదుర్తికి చెందిన నాయకుడు, కూటమి నాయకుల మధ్య పంచాయితీ జరిగింది. మద్యం దుకాణాలకు అద్దె గదుల విషయంలో వివాదం నెలకొని ఉద్రిక్తత చోటుచేసుకుంది. దీంతో ఇరువర్గాల మధ్య పోలీసు అధికారుల సమక్షంలో సుమారు గంటపాటు చర్చలు జరిగాయి. ఈ చర్చల సమయంలో ఇరువర్గాలకు చెందిన కార్యకర్తలు ఏకంగా పోలీసు స్టేషన్ ఆవరణలో గుమిగూడారు. పోలీసు స్టేషన్‌లో పంచాయితీ అనంతరం సీఐ దస్తగిరి, ఎస్ఐ మైనుద్దీన్‌లు అదనపు బలగాలతో గ్రామంలో కవాతు చేశారు.

ప్రభుత్వ ఉత్తర్వులు మున్సిపల్ ఉపాధ్యాయులకు వర్తించాలి



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు, ఉత్తర్వులు మున్సిపల్ టీచర్లకు వర్తింపజేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో ఇప్పటికీ తగినంతమంది సబ్జెక్టు టీచర్లు లేరన్నారు. 3, 4, 5 తరగతులను విలీనం చేశారే తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూల్ అసిస్టెంట్‌లను ఇవ్వలేదన్నారు. వారికి ప్రమోషన్లు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడంలేదన్నారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఈఓ పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఈఓ మర్రెడ్డి అనురాధకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సీవీ రమణ, ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రూతు ఆరోగ్య మేరి, నాయకులు కృష్ణారెడ్డి, మేరీ ప్రసన్న, దత్తు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు



80 పరుగులు చేసిన విశాఖ బ్యాట్స్‌మన్ రామ్‌చరణ్



65 పరుగులు చేసిన తూర్పుగోదావరి బ్యాట్స్‌మన్ కార్తీక్

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అంతర్ జిల్లాల అండర్–14 క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించాల్సిన ప్రకాశం, కర్నూలు మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. వైఎస్ఆర్‌ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో తొలిరోజు వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోగా, రెండోరోజు గురువారం ఓవర్లు తగ్గించి మ్యాచ్ నిర్వహించారు. బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 39 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. జట్టులోని రామచరణ్ 80 పరుగులు, వినోద్ 52 పరుగులు, తమన్‌రెడ్డి 51 పరుగులు చేశారు. కడప బౌలర్లు సాయికృష్ణచైతన్య 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 39 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 98 పరుగులు చేసింది. జట్టులోని లోకేష్ 33, యోగాంజనేయులు 23 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు ప్రఖ్యాత్‌వర్మ 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగియగా, విశాఖ జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

తూర్పుగోదావరి జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో బ్యాటింగ్‌కు దిగిన తూర్పుగోదావరి జట్టు 25 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 127 పరుగులు చేసింది. జట్టులోని కార్తీక్ 65 పరుగులు, రాజ్ ఆర్యన్ 20 పరుగులు చేశాడు. పశ్చిమగోదావరి బౌలర్లు కార్తీక్ వర్మ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పశ్చిమగోదావరి జట్టు 25 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. జట్టులోని పొన్నస్‌నారాయణ 22, రిత్విక్‌రెడ్డి 35 పరుగులు చేశారు. తూర్పుగోదావరి బౌలర్లు నిఖిలేష్ 2 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగియగా, తూర్పుగోదావరి జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

పీజీలో మొదలైన స్పాట్ అడ్మిషన్లు



స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న వైవీయూ అధికారులు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో నేరుగా ప్రవేశాలు (స్పాట్ అడ్మిషన్లు) గురువారం ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయంలో 25 కోర్సులకు గాను ఏపీపీజీసెట్– 2024 అర్హత సాధించిన అభ్యర్థుల వారి సర్టిఫికెట్లను ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేశాలు ఈనెల 21వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. డాక్టర్ వి. రామకృష్ణ, డాక్టర్ ఎన్. గణేష్ నాయక్‌లు విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు.

రౌడీషీటర్లకు పోలీసుల కౌన్సెలింగ్



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐలు

కడప అర్బన్ : కడప చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, అనుమానితులకు కడప చిన్నచౌక్ సీఐ ఎస్. తేజమూర్తి ఆదేశాల మేరకు ఎస్ఐలు ఎస్. రాజరాజేశ్వర్‌రెడ్డి, పి.రవికుమార్‌లు గురువారం కౌన్సెలింగ్ చేశారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రహదారిపై వరినాట్లు వేసి నిరసన



వరినాట్లు వేస్తున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల పట్టణ నడిబొడ్డున ఉన్న సాయిబాబా మందిరం వద్ద ప్రధాన రహదారిపై సీపీఎం నాయకులు వరినాట్లు వేసి నిరసన తెలిపారు. గత మూడు రోజులుగా కురిసిన వానకు ప్రధాన రహదారిపై పెద్ద గుంత ఏర్పడి నీళ్లు నిలబడ్డాయి. గుంతను పూడ్చేందుకు అధికారులు పట్టించుకోక పోవడంతో సీపీఎం నాయకులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీబీ, సుందరయ్య, గురయ్య, రవి, రత్నం తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలుశిక్ష

కడప అర్బన్ : మద్యం తాగి మోటార్ సైకిల్ నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన పసుపులేటి ఈశ్వరయ్యకు 7 రోజుల జైలు శిక్ష, రూ. 3000 జరిమానా విధిస్తూ కడప ఫస్ట్‌క్లాస్ స్పెషల్ జేఎస్‌సీఎం మెజిస్ట్రేట్ మంగళగౌరీ శిక్ష విధించినట్లు కడప ట్రాఫిక్ సీఐ డి.కె. జావీద్ తెలిపారు. నిందితుడిని గురువారం కోర్టులో హాజరు పర్చగా ఈ మేరకు తీర్పు చెప్పారు.

ఇసుక రీచ్ ప్రారంభం

పెండ్లిమర్రి : మండలంలోని కొత్తగంగిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో నూతన ఇసుక రీచ్‌ను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, మైనింగ్ ఆర్ఐ విమలమ్మ పాల్గొన్నారు.

ఈవీఎంల అక్రమాలపై 19న సమావేశం

కడప రూరల్ : ఈనెల 19వ తేదీన మహాజనరాజ్యం పార్టీ ఆధ్వర్యంలో ఎన్నికల అక్రమాలు, ఈవీఎంల అవకతవకలపై సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు సంగటి మనోహర్ తెలిపారు. కడప నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్ లో ఉదయం 10 గంటలకు నిర్వహించే సమావేశంలో వివిధ పార్టీలు, కుల సంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొనాలని కోరారు.

పసుపులేటికి ఆంధ్రరత్న గౌరవం

ఒంటిమిట్ట : అఖిల భారత తెలుగు సంస్కృతి సమాఖ్య, ఆంధ్రప్రదేశ్ కల్చరల్ అవేర్‌నెస్ సొసైటీ, అర్పిత సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో వైఎస్సార్ జిల్లా ధార్మిక సంస్థల పరిరక్షణ సమితి అధ్యక్షుడు, ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ పసుపులేటి శంకర్‌కు ఆంధ్రరత్న గౌరవ పురస్కారం ఇవ్వనున్నారు. ఈనెల 21వ తేదీన విజయవాడలో ఆత్మీయ పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది.

డైలీ వేజ్ వర్కర్లను కొనసాగించాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : నగరపాలక సంస్థ పరిధిలో కరోనా సమయం నుంచి శానిటేషన్ విభాగంలో పని చేస్తున్న కంటిన్జెంట్, డైలి వేజ్ వర్కర్లను తొలగించాలని ఈ నెల 4వ తేదీ నగరపాలక స్టాండింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించడాన్ని నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ .నాగ సుబ్బారెడ్డి , జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్ లు మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో తమ ప్రాణాలు పణంగా పెట్టి ప్రజా ఆరోగ్యాన్ని కాపాడిన కార్మికుల పట్ల ఇలా వ్యవహరించడం సరైనది కాదన్నారు. పాలక ప్రభుత్వాలు, అధికారులు రాజకీయ వేధింపులకు పాల్పడడం బాధాకరమన్నారు. జనాభాకనుగుణంగా కార్మికులను పెంచాల్సింది పోయి తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులందరికీ పని భద్రత కల్పించి ఆప్కాస్ లో చేర్చి ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ధర్నా అనంతరం డీఆర్ఓ గంగాధర్ గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కేసీ.బాదుల్లా, అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తారక రామారావు, కోశాధికారి వెంకటాద్రి, ఉపాధ్యక్షులు కంచుపాటి జాన్, చంద్ర, మేలంగి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ హైవేలో భూములు కోల్పోయిన వారికి న్యాయం చేయాలి

బ్రహ్మంగారిమఠం : నేషనల్ గ్రీన్ హైవేలో భూములు కోల్పోయిన మండలంలోని మల్లేపల్లె, ముడుమాల, పలుగురాళ్లపల్లె పంచాయతీలోని గ్రామాలకు చెందిన రైతులకు తక్షణం రుణ సహాయం అందేలా చూడాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మేకల రత్నకుమార్ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డిలు రెవిన్యూస్పెషల్ కలెక్టర్ వెంకటపతిని కోరారు. గురువారం సాయంత్రం బి.మఠం తహసీల్దార్ కార్యాలయంలో భూములు కోల్పోయి ఇంకా నష్ట పరిహారం అందని రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రధానంగా చుక్కల భూములు, డీకేటీ పట్టాలకు ఇంతవరకు నష్ట పరిహారం ఇవ్వలేదన్నారు. దీనిపై స్పందించిన స్పెషల్ కలెక్టర్ మాట్లాడుతూ భూములు కోల్పోయిన వారి అవార్డులను పరిశీలించి నష్టపరిహారం వచ్చేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దామోదరరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ జాన్స్, డిప్యూటీ సర్వేయర్ సాంబశివారెడ్డి, వివిధ గ్రామాలనుంచి వచ్చిన భూ నిర్వాసితులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.